సాక్షి
గుంటూరు
మంగళవారం । 2 । జూలై । 2024



వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: వేమవరంలోని కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.



కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం

నరసరావుపేట ఈస్ట్: కోటప్ప రోడ్డు శ్రీనివాస నగర్‌లోని గోదా పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు.



మేతగా మారిన మొక్కలు

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు–మాచర్ల ప్రధాన రహదారిలో సెంట్రల్ డివైడర్‌పై ఏర్పాటు చేసిన మొక్కలు మేకలకు మేతగా మారాయి. అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి మరి.

న్యూస్‌రీల్

జిల్లా వ్యాప్తంగా 94.70 శాతం పింఛన్ల పంపిణీ



నెహ్రూనగర్: జిల్లా వ్యాప్తంగా 94.70శాతం పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో 2,58,786 మందికి గానూ రూ.173.9 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం రాత్రి 8 గంటల వరకు 2,45,071 మందికి రూ.165.4కోట్లను సిబ్బంది పంపిణీ చేశారు. మిగిలిన 13,715 మందికి మంగళవారం అందజేయనున్నారు.

నృసింహస్వామికి రూ.46,54,752 ఆదాయం

మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి రూ. 46,54,752 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. రామకోటి రెడ్డి తెలిపారు. ఎగువ, దిగువ సన్నిధులతో పాటు ఘాట్ రోడ్డులో ఉన్న ఆలయ ఆదాయాన్ని సోమవారం దిగువ మండపంలో లెక్కించారు. ఎగువ సన్నిధికి రూ. 21,66,014, దిగువ సన్నిధికి రూ. 22,75,186, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ. 69,616, అన్నదానానికి రూ. 53,936 సమకూరినట్లు ఈవో పేర్కొన్నారు. గతంలో ఆదాయం రూ. 42,18,631 రాగా ఇప్పుడు రూ. 3,46,121అధికంగా వచ్చిందని ఆయన వెల్లడించారు. లెక్కింపును కాజ గ్రూపు దేవాలయాల ఈవో పి. వెంకటరెడ్డి పర్యవేక్షించారు.

యార్డుకు 32,157 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 32,157 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 27,904 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 20,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ.17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,000 నుంచి రూ.19,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 16,461 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

పీసీలు లేని ఎరువుల అమ్మకాలపై నిషేధం



తెనాలి రూరల్: ప్రిన్సిపల్ సర్టిఫికెట్(పీసీ)లేని పురుగు మందుల అమ్మకాల్ని నిలిపివేయాలని విజిలెన్స్ అధికారులు వ్యాపారుల్ని ఆదేశించారు. పట్టణ గంగానమ్మపేటలోని పురుగు మందుల దుకాణాలను వ్యవసాయాధికారులతో కలసి విజిలెన్స్ అధికారులు సోమవాం తనిఖీ చేశారు. ఓ దుకాణంలో పీసీలు లేని రూ. 2,51,770 విలువ గల నాలుగు రకాల పురుగు మందుల అమ్మకాల్ని నిలిపివేయించారు. సరైన పీసీలు లేని పురుగు మందుల్ని విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యాపారుల్ని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏవో కె. రమణకుమార్, ఎస్ఐ ఎం. రామచంద్రారెడ్డి, ఏడీఏ ఎన్. ఉషారాణి, మండల వ్యవసాయాధికారి జి. ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

గుంటూరు పశ్చిమలో 16 మి.మీ. వర్షం

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి అత్యధికంగా గుంటూరు పశ్చిమలో 16 మిల్లీమీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా గుంటూరు తూర్పులో 0.8 మి.మీ. పడింది. సగటున 7.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. మేడికొండూరు మండలంలో 12.8 మి.మీ., తుళ్లూరు 9.8, దుగ్గిరాల 9.4, ప్రత్తిపాడు 9.4, చేబ్రోలు 9, మంగళగిరి 7.4, పెదకాకాని 7.4, కొల్లిపర 6.6, పెదనందిపాడు 6.4, తెనాలి 6.4, పొన్నూరు 6.2, తాడికొండ 6, వట్టిచెరుకూరు 5.4, ఫిరంగిపురం 5.2, కాకుమాను 5, తాడేపల్లి మండలంలో 2.8 మి.మీ. చొప్పున వర్షం పడింది.

ఒక్క క్లిక్‌తో ఎయిమ్స్

- 'ఈ- పరామర్శ' యాప్‌తో సులభంగా వైద్య సేవలు
- గ్రామీణ ప్రాంత రోగులకు అవగాహన కరువు
- యాప్ వైద్య సేవలపై మరింత ప్రచారం కలిగించాలంటున్న ప్రజలు



మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రి

మంగళగిరి: రాష్ట్రానికే తలమానికంగా, దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద ఆసుపత్రిగా మంగళగిరిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్) విలసిల్లుతోంది. నిపుణులైన వైద్యులు, అధునాతన పరికరాలతో పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వచ్చాయి. తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు అందడంతో రోగులు బారులు తీరుతున్నారు. రాష్ట్రంతో పాటు తెలంగాణ, చెన్నై, ఒడిస్సా రాష్ట్రాల నుంచి రోజుకు మూడు వేల మందికిపైగా వస్తున్నారు.

రోగులకు తప్పని కష్టాలు

రోగులకు సులభతరంగా వైద్య సేవలందించేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలు ఫలితాన్ని ఇవ్వడం లేదు. ఆస్పత్రిలో వసతుల గురించి అవగాహన కల్పించడంలో విఫలం చెందుతున్నారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు కష్టాలు తప్పడం లేదు. సమస్యను గుర్తించిన ఎయిమ్స్ అధికారులు 'ఈ- పరామర్శ' యాప్ ద్వారా టెలీ మెడిసిన్ అందుబాటులోకి తెచ్చారు. నేరుగా వైద్యసేవలు అందని వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఒకసారి వైద్యం చేయించుకున్న వారు తర్వాత యాప్ ద్వారా వైద్య సేవలందుకునే అవకాశం ఉంది. అయితే, దీనిపై రోగులకు పెద్దగా అవగాహన లేక ఉపయోగించడం లేదు.

టెలీ కన్సల్టెన్సీ రిక్వెస్ట్ కోసం ..

టెలీ కన్సల్టెన్సీ మీద నొక్కితే రోగి వివరాలు కనిపిస్తాయి. జనరల్ మెడిషన్, దంత, నేత్ర, ఎముకలు ఇలా.. 12 రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి. రోగి ఏ విభాగం సేవలు కోరుకుంటే ఆ విభాగం జ్వరం, దగ్గు, ఇతర లక్షణాలు నమోదు చేయాల్సిందిగా అడుగుతుంది. ఆరోగ్య సమస్య ఏమిటని ఒక టేబుల్ వస్తుంది. దానిలో రోగి ఆరోగ్య సమస్య నమోదు చేయాలి. సంబంధిత వైద్య విభాగంలో స్లాట్ బుకింగ్‌లోకి వెళ్తాం. రోగికి కావాల్సిన తేదీని నమోదు చేయాలి. వారంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజు ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య (శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు) వైద్యులు అందుబాటులోకి వచ్చి సలహాలు ఇస్తారు.

నేరుగా వచ్చే వారికీ ఉపయోగకరం

నేరుగా ఓపీకి వెళ్లి రూ 10 చెల్లించి సంబంధిత వైద్యుడితో పరీక్ష చేయించుకోవచ్చు. రక్త, ఇతర పరీక్షలు, స్కానింగ్, ఎక్సరే చేయించుకున్నాక సంబంధిత రిపోర్టులు యాప్‌లో నమోదు చేసుకోవచ్చు. యాప్ ద్వారా వైద్యులకు ఆరోగ్య సమస్యలపై వివరించవచ్చు. వారు ఇచ్చే సలహాలను బట్టి వైద్యసేవల్ని పొందవచ్చు. నేరుగా ఎయిమ్స్‌కు వచ్చే రోగులు ఓపీ ఎంక్వయిరీతో పాటు యాప్‌లో ఏ వైద్యుడు ఎక్కడ సేవలందిస్తారనే వివరాలు, గది నంబర్ తెలుసుకోవచ్చు. ఓపీలో రూ. 10 చెల్లించాక వైద్యుడు రాసే పరీక్షల చార్జీలను వెంటనే తెలుసుకోవచ్చు. చేయించుకున్న పరీక్షల రిపోర్టులు మన మొబైల్ యాప్‌కు వస్తాయి. ఇదే యాప్‌లో కుటుంబసభ్యులకు సంబంధించి మరో వ్యక్తి పేరు యాడ్ చేసుకోవచ్చు. దీన్ని నొక్కితే ఈ మొబైల్‌లో యాడ్ అయిన కుటుంబ సభ్యులకు సంబంధించిన వైద్య వివరాలు తెలుస్తాయి.

విస్తృత అవగాహన అవసరం

అసలు చాలామందికి 'ఈ–పరామర్శ' యాప్ సౌకర్యం ఉన్నట్లు తెలియదు. 'ఎయిమ్స్ వైద్య సేవలు కోరుకుంటున్నారా ? అయితే ఆ యాప్ ఎంతో ఉపయోగపడుతుంద'ని ఎయిమ్స్ అధికారులు ప్రచారం చేస్తున్నా ప్రయోజనం ఉండటం లేదు. గ్రామ ప్రాంతాల నుంచి అధికంగా వస్తున్న రోగులు నిరక్షరాస్యులు కావడంతో యాప్‌పై అవగాహన లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు మరింత అవగాహన కల్పించి, విస్తతంగా ప్రచారం కల్పించాలని రోగులు కోరుతున్నారు.

యాప్ డౌన్‌లోడ్ చేసుకునే పద్ధతి

గుగూల్ ప్లే స్టోర్‌లో ఎయిమ్స్ మంగళగిరి అని సెర్చ్ చేసి 'ఈ–పరామర్శ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గెట్ స్టార్టెడ్ క్లిక్ చేయాలి.లాగిన్ పేషంట్ లేదా డాక్టర్ అని ఆప్షన్స్ వస్తాయి. రోగి తన ఫోన్ నంబర్ నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. లాగిన్ అయ్యాక రోగి తండ్రి పేరు వయస్సు, పురుషుడు లేదా స్త్రీ చిరునామా మెయిల్ ఐడీ ఇవ్వాలి. రిజిస్టర్ బటన్ నొక్కితే యాప్‌లో లాగిన్ అవుతారు.





సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఎం రామకృష్ణ

జీఎస్టీతో బలమైన ఆర్థిక శక్తిగా భారత్

- గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణ
- ఘనంగా జీఎస్టీ వేడుకలు
- విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

లక్ష్మీపురం:జీఎస్టీ అమలుతో భారత ఆర్థిక వ్యవస్థ మరింత పుంజుకుంటుందని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక శ్రీనివాసరావుపేటలోని టుబాకో అసోసియేషన్ హాలులో సోమవారం 8వ జీఎస్టీ దినోత్సవాన్ని కమిషనర్ సాధు నరసింహారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో అతి పెద్ద సంస్కరణ జీఎస్టీయేనని, దీనివల్ల పన్నుల రంగంలో భారీ మార్పులు వచ్చాయని తెలిపారు. పన్నుల వ్యవస్థ పూర్తిగా చక్కబడిందన్నారు. బిడ్డ ఎదుగుదలకు తల్లిదండ్రుల పాత్ర ఎంత ముఖ్యమో, జీఎస్టీ కూడా దేశ ఆర్థికాభివృద్ధికి అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ఉద్యోగులంతా కొంత సమయాన్ని ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని ఆయన సూచించారు. నిత్యం 45 నిమిషాల పాటు యోగా, వ్యాయామం లేదా నడవాలని తెలిపారు.

- టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలకు ఉత్తరాఖండ్ స్టేట్ నుంచి తాను పాల్గొన్నానని తెలిపారు. జులై 1, 2017నుంచి ప్రారంభించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అన్ని టాక్స్‌లు కలిపితేనే జీఎస్టీ వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ సక్రమంగా చెల్లిస్తూ దేశ పురోభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. స్టేట్, సెంట్రల్ జీఎస్టీ అధికారులు పరస్పర సహకారంతో పని చేయాలని ఆయన సూచించారు.
- సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ గత ఏడేళ్లలో వసూళ్లు గణనీయమైన వృద్ధి సాధించాయని తెలిపారు. దేశంలో ప్రారంభ మైన తొలి నెలలో వసూళ్లు రూ.93 వేల కోట్లు కాగా, ఇప్పుడు రూ. 2.10 లక్షల కోట్లకు చేరిందన్నారు.
- గుంటూరు సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్‌లో గత ఆర్థిక సంవత్సరంలో రూ.403 కోట్లు ఎగవేతను గుర్తిస్తే దానిలో రూ.280 కోట్లు వసూలు చేశామని చెప్పారు. 2023–24లో గుంటూరుకు రూ.7 వేల కోట్లు ఆదాయం లభించిందని వెల్లడించారు.

అనంతరం ప్రభుత్వానికి అత్యధిక జీఎస్టీని చెల్లించిన పలువురికి టాప్ టాక్స్ పేయర్స్ సర్టిఫికెట్‌లను అందజేశారు. విధి నిర్వహణలో విశేష ప్రతిభను చూపిన ఉద్యోగులకు, సోషల్ వర్కర్లకు, ఆరోగ్య వీరులకు (హెల్త్ హీరోస్) ప్రశంసా పత్రాల్ని బహూకరించారు. జీఎస్టీ శాఖలో ఎనలేని సేవల్ని అందించిన విశ్రాంత ఉద్యోగుల్ని ఘనంగా సత్కరించారు. రాష్ట్రపతి అవార్డు పొందిన విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి, అసిస్టెంట్ కమిషనర్ వీరవల్లి అంకినీడు ప్రసాద్‌ను ప్రత్యేక ఆహ్వానితునిగా సత్కరించి, జ్ఞాపికను అందించారు. క్రీడలలో విజేతలుగా నిలిచిన ఉద్యోగులు, వారి పిల్లలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సెంట్రల్ జీఎస్టీ అడిషనల్ కమిషనర్ జి.రామకృష్ణరాజు యాదవ్, జాయింట్ కమిషనర్ ఉపేంద్రకుమార్ ధృవ్, అసిస్టెంట్ కమిషనర్లు రవికుమార్, నాగరాజు, సీతారామరాజు, సూపరింటెండెంట్లు గాదే శ్రీనివాసరెడ్డి, టీవీజీకె మూర్తి, యుగంధర్, నవీన్ రాజు, ఈశ్వరరావు, చిట్టి, గద్దె లిలక్, టి.వివేకానంద పాల్గొన్నారు.

కఠెవరంలో పింఛన్ల పంపిణీ



పింఛను పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్: మండలంలోని కఠెవరంలో సోమవారం రాత్రి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వంపై ఆర్థికభారం పడినా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో హామీల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం పట్టణంలోని ఏడు, 18 వార్డుల్లో లబ్ధిదారులకు ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రసాద్, ఎంపీడీవో విజయాలక్ష్మణ్, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, పలువురు మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దూర విద్య టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో గత జూన్‌లో జరిగిన దూరవిద్య టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం ఏపీ ఓపెన్ స్కూల్.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌లో సందర్శించాలని సూచించారు. గుంటూరు జిల్లాలో దూరవిద్య టెన్త్ పరీక్షలకు హాజరైన 779 మంది అభ్యర్థుల్లో 658 మంది, ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసిన 1,224 మంది అభ్యర్థుల్లో 996 మంది ఉత్తీర్ణులైనట్లు వివరించారు. సంబంధిత అభ్యర్థులు మార్కుల జాబితాలను ఏపీఓపెన్ స్కూల్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు. రీ–కౌంటింగ్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.200, రీ–వెరిఫికేషన్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున ఈనెల 13లోపు ఆన్‌లైన్‌లో పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలని తెలిపారు.

అతిసార వ్యాధి అంతమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ రాజకుమారి, అధికారులు

గుంటూరు వెస్ట్: జిల్లాలో అతిసార వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు అధికారులంతా సమష్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో 'డయేరియాను ఆపండి!' కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల 31 వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో వైద్య శాఖతోపాటు ఇతర శాఖలు కలిసి పని చేయాలని ఆమె ఆదేశించారు. ఇందులో భాగంగా ఐదేళ్లలోపు పిల్లలకు ఉచితంగా రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలు పంపిణీ చేయాలని చెప్పారు. ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా అందజేయాలని సూచించారు. అతిసార వ్యాధిపై గ్రామ స్థాయి నుంచి విస్తృత స్థాయి ప్రచారం చేయాలని తెలిపారు. దీంతోపాటు పరిసరాల పరిశుభ్రతపైనా దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాజకుమారి, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, , డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి, ఎం.గంగరాజు, ఆర్డీవో పి.శ్రీకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

3.50 కిలోల గంజాయి పట్టివేత

మంగళగిరి: అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనే ఆశతో యువత గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నారని పట్టణ సీఐ వినోద్ కుమార్ తెలిపారు. పట్టణ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎయిమ్స్ పక్కనున్న పొదల్లో గంజాయి తాగుతున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి గరిక శ్రీనివాసరావు అనే యువకుడిని పట్టుకున్నట్లు చెప్పారు. అతని వద్ద నుంచి 3.50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. శ్రీనివాసరావు గంజాయికి అలవాటుపడి, విశాఖపట్నం బీచ్‌లో సాధువుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. వాటిని పొట్లాలు కట్టి విక్రయించి డబ్బు సంపాదిస్తున్నట్లు వివరించారు. శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ. 35 వేల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ కె. ఖాదర్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల విన్నపాలు వినవలె !



ప్రజల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ రాజకుమారి

- అధికారులకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశం
- సమష్టిగా అర్జీలను పరిష్కరించండి

గుంటూరు వెస్ట్: వివిధ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల అర్జీల్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతోనే అర్జీల పరిష్కారం సాధ్యమని తెలిపారు. తమకు సంబంధంలేదంటూ అర్జీదారుడిని తిప్పుకోవద్దని హితవు పలికారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం వచ్చిన 142 అర్జీలను జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, ఎం.గంగరాజు, ఆర్డీవో పి.శ్రీకర్, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు.

వికలాంగుల ఫించన్ ఇవ్వడం లేదు



నా భర్తకు ఏడేళ్ల కిందట రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. ఏ పని చేయ లేరు. నేనే కూలీ నాలీ చేసుకుని కుటుంబాన్ని సాకుతున్నాను. సదరం సర్టిఫికెట్ కోసం వెళితే వైద్యులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. న్యాయం చేయండి.

– టి.రమణ, గోరంట్ల

ఎకరం పొలానికి 80 సెంట్లు ఆన్‌లైన్



నాకు ఫిరంగిపురం మండలం తక్కెళ్లపాడులో ఎకరం పొలం ఉంది. దస్తావేజులతో పాటు అన్ని ఆధారాలు ఉన్నాయి. సర్వే సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. కాని ఆన్‌లైన్‌లో 80 సెంట్లు మాత్రమే నమోదు చేశారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా రెవెన్యూ స్పందించడం లేదు.

– బి.సత్యనారాయణ, ఫిరంగిపురం

చట్ట పరిధిలో బాధితుల సమస్యలకు పరిష్కారం

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



బాధితురాలి సమస్య ఆలకిస్తున్న ఎస్పీ

నగరంపాలెం: ఉద్యోగాల పేరుతో మోసగించారని ఇద్దరు, తాను బతికి ఉండగానే మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ మహిళ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీవో)లోని హాలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యల్ని ఆలకించారు. చట్ట పరిధిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని బాధితులకు తెలియజేశారు. జిల్లా ఏఎస్పీలు (పరిపాలన) జి.వి.రమణమూర్తి, ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీసీఆర్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు అర్జీలు స్వీకరించారు.

మరణ పత్రం సృష్టించి స్థలం రిజిస్ట్రేషన్

భర్తతో విడిపోయి ఉంటున్నా. ప్రస్తుతం ఓ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్నా. పెళ్లి సమయంలో గుంటూరు నగరంలోని ఓ ఏరియాలో 261 గజాల స్థలాన్ని నా తల్లిదండ్రులు నా పేరు, భర్త పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. స్థలం విక్రయించేందుకు సంతకం చేయాలని ఇబ్బందులకు గురి చేసేవాడు. దీంతో పెట్టేందుకు నిరాకరించాను. ఈ క్రమంలో తాను చనిపోయినట్లు మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి, స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించారు. న్యాయం చేయాలి.

– కె.వెంకటరత్నం, కొరిటెపాడు రెండో వీధి

మోసం చేసిన మధ్యవర్తులు

భార్యతో విడిపోగా, పిల్లలను పెంచాను. వారిని చదివించి, వివాహాలు చేశాను. కుటుంబ అవసరాల నిమిత్తం పిల్లల వివాహ సమయంలో 261.77 గజాల స్థలంలో నా పేరుపై ఉన్న సగ భాగం విక్రయించాను. పిల్లలు సంతకాలు చేయగా, జీపీఏ చేయించుకున్నాం. ఈ క్రమంలో భార్య తన పేరుని మార్చుకుంది. తన ఆస్తిని విక్రయించానని బెదిరించడంతో పాటు నా పేరుపై ఉన్న ఆస్తిని కూడా రాసివ్వాలని డిమాండ్ చేస్తోంది. ఇటీవల ఓ మధ్యవర్తి తమ స్థలం అక్రమించి విక్రయించేందుకు సిద్ధమవ్వగా, నల్లపాడు పీఎస్‌లో ఫిర్యాదు చేశాం. అక్రమణదారులను అరెస్ట్ చేశారు. మధ్యవర్తులే ఆమె పేరుపై మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించడంతోపాటు నా పేరు, భార్య పేరుపై నకిలీ వ్యక్తులను సృష్టించారు.

– డి.ఏసురాజు, మాచర్ల టౌన్

ఉద్యోగాల పేరుతో మోసం

ఉయ్యూరులో ఉంటున్న ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలోని ఓ సిమెంట్ కంపెనీలో డేటా ఎంట్రీ ఉద్యోగాలు యిప్పిస్తామని నమ్మబలికాడు. ఇద్దరం కలసి విడతల వారీగా రూ. 2,35,300 ఇచ్చాం. ఉద్యోగాల విషయం అడిగితే కాలయాపన చేసేవాడు. త్వరలో నియామక పత్రం వస్తుందని చెప్పేవాడు. ఉద్యోగాలు వద్దు, డబ్బులివ్వమని అడిగితే సరైన సమాధానం ఉండటం లేదు. సదరు వ్యక్తి గతంలోనూ పలువుర్ని మోసగించినట్లు తెలిసింది. అతన్ని విచారించి న్యాయం చేయాలని కోరుతున్నాం.

–కావటి గోపీ శ్రీనివాసరావు, ఆర్.అగ్రహారం
– మందా గోపీ, నల్లచెరువు ఆరో వీధి

ఇజ్రాయల్ వీసా పేరిట మోసం

స్నేహితుని ద్వారా హైదరాబాద్‌లోని ఓ జాబ్ కన్సల్‌టెంట్ పరిచయమయ్యాడు. దీంతో ఇజ్రాయల్ వెళ్లేందుకు వీసాకు దరఖాస్తు చేశాను. ఢిల్లీలో కార్యాలయం ఉందని చెప్పగా, అంత దూరం రాలేనని తెలియజేశా. దీంతో ఒక రిప్రజెంటేటివ్‌ను పరిచయం చేశారు. దీంతో అడ్వాన్స్‌గా రూ.50 వేలు చెల్లించాను. వీసా వచ్చిందని ఒక లెటర్ పంపించారు. అందులో 21 రోజుల్లో స్టాంపింగ్ చేయించుకోవాలని ఉంది. దీంతో రూ.3.50 లక్షలు చెల్లించాం. అప్పటి నుంచి ఇద్దరు ఫోన్లు లిఫ్ట్ చేయడం లేదు.

– కె.సురేష్, బొడ్డురాయి బజార్, గుజ్జనగుండ్ల

క్లుప్తంగా

జాతీయ అథ్లెటిక్ పోటీల్లో రేష్మికి కాంస్య పతకం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఇటీవల ఛండీగఢ్‌లోని పంచకులలో జరిగిన 63వ జాతీయ అంతర్ రాష్ట్రాల అథ్లెటిక్ పోటీల్లో జావెలిన్ త్రో విభాగంలో గుంటూరుకు చెందిన రేష్మి కాంస్య పతకం సాధించిందని అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవెంట్‌లో 52.39 మీటర్ల దూరం విసిరి తృతీయ స్థానం పొందిందని పేర్కొన్నారు. ఇప్పటికే రేష్మి ఖాతాల్లో అనేక జాతీయ పతకాలు చేరాయన్నారు. ఈ సందర్భంగా రేష్మికి ఏఐసీసీ కార్యదర్శి జి.ఉషా నాయుడు, స్పోర్ట్స్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ ఎం.శివకుమార్, టి.అరుణ్‌కుమార్ అభినందనలు తెలిపినట్లు తెలియజేశారు.

పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను గుంటూరు–విజయవాడ మీదుగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ సోమవారం వెల్లడించారు. రైలు నంబర్ 17329 (హుబ్లీ–విజయవాడ) ఈనెల 15నుంచి 31వరకు, 17330 (విజయవాడ–హుబ్లీ) ఈనెల 16 నుంచి ఆగస్టు 1వరకు, 17282 (నరసాపూర్–గుంటూరు), 17281 (గుంటూరు–నరసాపూర్) ఈనెల 1నుంచి 31వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మార్పును ప్రయాణికులు గమనించాలని ఆయన కోరారు.

టేకు చెట్ల నరికివేత : నిందితుల అరెస్టు

ముప్పాళ్ల: ముప్పాళ్లలోని వ్యవసాయ భూమిలో టేకుచెట్లను అక్రమంగా నరికి అమ్మకం జరిపిన నిందితుల్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సత్తెనపల్లి రూరల్ సీఐ ఎమ్.రాంబాబు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన సీహెచ్ వెంకటనాగకోటేశ్వరరావుకు చెందిన వ్యవసాయ భూమిలోని పది టేకు చెట్లను నరికి ట్రాక్టర్ల ద్వారా తరలించిన సంగతి తెలిసిందే. రైతు ఫిర్యాదు మేర కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంలో మొత్తం తొమ్మిది మంది పాల్గొన్నట్లు నిర్ధారించుకొని వారిపై కేసు నమోదు చేశారు. వారి నుంచి దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



ర్యాలీ ప్రారంభోత్సవంలో డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, సిబ్బంది

గుంటూరు మెడికల్: ప్రస్తుత వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా ఆమె సోమవారం నగరంలో అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జులై అంతా డెంగీ వ్యతిరేక మాసంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. డెంగీ నివారణే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని సూచించారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. డెంగీని వ్యాపింపజేసే ఏడీస్ ఈజిప్టి దోమ మంచి నీటిలో గుడ్లు పెడుతుందన్నారు. దీన్ని టైగర్ మస్కిటో కూడా అంటారని, ఇది తెల్లవారుజాముననే కుడుతుందని చెప్పారు. ఇళ్ల లోని నీటి తొట్టెలు, కొబ్బరి చిప్పలు,తాగి పడేసిన టీ కప్పులు, రోళ్లు, పాత టైర్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, పూల కుండీలు, వాటర్ కూలర్లలో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని తెలిపారు. సాయంత్రం వేప పొగ వేయడం, శరీరాన్ని పూర్తిగా కప్పిఉంచే దుస్తులు ధరించడం ఉత్తమమని సూచించారు. ఇళ్లకు మెష్ డోర్లు, దోమతెరలు వాడటం వల్ల దోమకాటు నుంచి తప్పించుకోవచ్చని వివరించారు. వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు పాటించడం వల్ల దోమల వల్ల వచ్చే వ్యాధుల్ని అరికట్టవచ్చని పేర్కొన్నారు. ర్యాలీలో పాల్గొన్న ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది దోమల నివారణ చర్యలపై నినాదాలు చేశారు. ర్యాలీ నగరంపాలెంలోని మూడు బొమ్మల సెంటర్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డాక్టర్ బి.లక్ష్మనాయక్, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, రాజు నాయక్, సబ్ యూనిట్ ఆఫీసర్లు ఘంటసాల శ్రీనివాసరావు, నరేంద్ర, ప్రశాంత్, సాంబయ్య, సుకుమార్, వెంకటప్పయ్య, మల్లికార్జున్ రావు, వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఏవీ సుబ్బారావు పద్య గానం అజరామరం

- ప్రముఖ రంగస్థల సంగీగ దర్శకుడు చింతలపూడి చెంచయ్యకు పురస్కారం ప్రదానం



చెంచయ్యకు సన్మానం

తెనాలి: ప్రఖ్యాత రంగస్థల నటుడు, ఆంధ్ర గానకోకిల ఏవీ సుబ్బారావు పద్యగానంతో దశాబ్దాలపాటు నాటక అభిమానులను అలరించారని ప్రముఖ సాహితీవేత్త మన్నె శ్రీనివాసరావు కొనియాడారు. ఆయన కళా వారసత్వాన్ని తర్వాత రెండు తరాలు కొనసాగించడం, ప్రేక్షకుల ఆదరణ పొందడం అదృష్టమన్నారు. ఏవీ సుబ్బారావు 94వ జయంతి వేడుకలు, 13వ రంగస్థల పురస్కార ప్రదానోత్సవాన్ని సోమవారం సాయంత్రం తెనాలిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటైన సభకు మన్నె శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సభలో ప్రముఖ రంగస్థల సంగీత దర్శకుడు, నంది అవార్డు గ్రహీత చింతలపూడి చెంచయ్యకు ఏవీ సుబ్బారావు రంగస్థల పురస్కారం ప్రదానం చేశారు. శాలువ, గజమాలతో సత్కరించి అవార్డును, జ్ఞాపికను బహూకరించారు. గత నాలుగు దశాబ్దాలుగా ఏవీ సుబ్బారావు, ఆయన కుమారులు, మనవడికి సంగీత సహకారాన్ని అందిస్తున్న ప్రముఖ రంగస్థల సంగీత దర్శకుడు చింతలపూడి చెంచయ్యకు అవార్డు ప్రదానం సముచితమని వక్తలు ప్రశంసించారు. ఏవీ సుబ్బారావు రంగస్థల సమాఖ్యకు చెందిన శ్రీపూర్ణశ్రీ నాట్య కళాసమితి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రాష్ట్రానికి చెందిన ప్రసిద్ధ కళాకారులు ఆచంట బాలాజీనాయుడు, గుమ్మడి జీవన్‌కుమార్, కె.వనజకుమారి, సాకె మల్లికార్జునరావు, రత్నశ్రీ, డీఎస్పీ రావు, ఎ.రామదాసు, మోడి ఆంజనేయులు, బీఏ మోహనరావు, చింతలపూడి చంద్రశేఖరరావు, పాతూరి సుబ్రహ్మణ్యం, ధర్మరాజు, బి.శివశంకర్ పాల్గొన్నారు. ఏవీ సుబ్బారావు జయంతి ఉత్సవంలో భాగంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి పలు పౌరాణిక పద్య నాటకాల్లోని సన్నివేశాలను ప్రదర్శించారు. పాండవోద్యోగం(కర్ణ సందేశం), శ్రీరామాంజనేయ యుద్ధం(యుద్ధ సీను), చింతామణి(ప్రేమ సన్నివేశం), గయోపాఖ్యానం (యుద్ధసీను) ప్రదర్శించారు. వల్లూరు శ్రీహరిరావు- టీవీఎస్ శర్మ, ఆరాధ్యుల నాగరాజు–జి.పైడిరాజు, ఆరాధ్యుల ఆదినారాయణ–రత్నశ్రీ, ధూపం తిరుమలతేజ–దూపం రామకృష్ణ నటించారు. కార్యక్రమాన్ని ఆరాధ్యుల వెంకటేశ్వరరావు, ఆదినారాయణ, నాగరాజు పర్యవేక్షించారు.

మార్కెట్‌లోకి ఏతెర్ రిస్తా స్కూటర్ విడుదల



నగరంపాలెం: ఎలక్ట్రిక్ స్కూటర్ ఏతెర్ రిస్తా ఫ్యామిలీ వాహనం అని, అందరికీ అందుబాటు ధరలో ఉందని షోరూం ఎండీ చుక్కపల్లి శ్రీకాంత్ అన్నారు. అమరావతి రోడ్డులోని పవన్ ఏతెర్ షోరూంలో సోమవారం స్కూటర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ పునీత్‌కుమార్ మొదటి వాహన తాళాన్ని కొనుగోలుదారుకు అందించారు. ఈ సందర్భంగా ఎండీ చుక్కపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ రిస్తా స్కూటర్ ప్రారంభం ధర రూ.1,09,841 అని, మార్కెట్‌లోని స్కూటర్ల కంటే 900 ఎం.ఎం. పొడవు సీటు ఉంటుందని తెలిపారు. వాహనం 160 కి.మీ. సర్టిఫైడ్ రేంజ్ దూరం ప్రయాణిస్తుందని వివరించారు. బ్యాటరీ 3.7 కిలోవాట్ కెపాసిటీతో వాటర్, డస్ట్ ప్రూఫ్, ఫ్రంట్ డిస్క్ బ్రేక్, ఎల్‌ఈడీ పొషిషన్ ల్యాంప్, రివర్స్ మోడ్, సీట్ కింద 34 లీటర్ల స్టోరేజీ కెపాసిటీ, మూడేళ్ల బ్యాటరీ వారంటీ ఉందని పేర్కొన్నారు. ఏడు రంగుల్లో లభిస్తుందని, ముందస్తు బుకింగ్‌తో కొనుగోలుదారులు త్వరగా డెలివరీ పొందవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కంతేరు సర్పంచ్ మహేష్ మృతి





ఎయిమ్స్‌లో మహేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మండపాటి శేషగిరిరావు తదితరులు



మహేష్ (ఫైల్)

మంగళగిరి: మండలంలోని ఆత్మకూరు వద్ద సోమవారం ఉదయం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన బెజ్జం మహేష్(45) మృతి చెందారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహేష్ భార్యాపిల్లలతో కలసి హనుమాన్ జంక్షన్‌కు కారులో బయల్దేరారు. భార్య అక్కడ సచివాలయ ఉద్యోగిగా పని చేస్తోంది. మహేష్ నడుపుతున్న కారు అదుపు తప్పి ఎదురుగా వెళుతున్న లారీని ఢీకొట్టి, బోల్తా పడింది. మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా భార్యాపిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మండపాటి శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఎయిమ్స్ ఆసుపత్రికి చేరుకుని నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ కాంగ్రెస్ పార్టీ పట్ల పూర్తి అంకితభావంతో పనిచేసిన మహేష్ ప్రజల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో వ్యవహరించారని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పేరేచర్ల మస్తానవలి, తాడికొండ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు ఉన్నారు.

ఈతకు వెళ్లి గల్లంతైన విద్యార్థి మృతి



దుర్గా ప్రవీణ్ (ఫైల్)

సత్తెనపల్లి: స్నేహితులతో కలసి సరదాగా ఈతకు వెళ్లిన యువకుడు గల్లంతై మృతి చెందిన సంఘటన సత్తెనపల్లిలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 6వ వార్డుకు చెందిన తాపీ పనులు చేసే గుంజి రాంబాబు, తిరుపతమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు గుంజి దుర్గాప్రవీణ్ (10) పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో మరో ముగ్గురు స్నేహితులతో కలసి ఈత కొట్టేందుకు పట్టణంలోని తారకరామా సాగర్‌కు వెళ్లాడు. నలుగురు ఈత కొట్టేందుకు చెరువులోకి దిగగా ముగ్గురు మాత్రమే బయటికి వచ్చారు. దుర్గాప్రవీణ్ ఎంతసేపటికీ రాకపోవడంతో ముగ్గురు స్నేహితులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు. కుమారుడు ఇంటికి రాకపోవడంతో గుంజి రాంబాబు పలుచోట్ల ఆరా తీశాడు. అయినప్పటికీ ఎక్కడా సమాచారం లభించలేదు. తమ కుమారుడు దుర్గాప్రవీణ్ వెంట వెళ్లిన స్నేహితుల ఇళ్ల వద్దకు వెళ్లి సోమవారం ఉదయం ఆరా తీయగా .. నలుగురం కలసి ఈత కొట్టేందుకు తారకరామసాగర్ చెరువులో దిగామని, దుర్గాప్రవీణ్ ఒడ్డుకు రాకపోవడంతో కొద్దిసేపు చూసి తిరిగి వచ్చేశామని స్నేహితులు తెలిపారు. దీనిపై గుంజి రాంబాబు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు, పోలీసులు, మృతుడి తండ్రి గుంజి రాంబాబు తారక రామాసాగర్ వద్దకు చేరుకున్నారు. చెరువులో వెతుకులాట ప్రారంభించగా దుర్గా ప్రవీణ్ మృతదేహం లభించింది. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అందించారు. పట్టణ ఎస్ఐ ఎం. సంధ్యారాణి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు ఇక లేడన్న వార్త తెలియడంతో మృతుడి తల్లిదండ్రులు తిరుపతమ్మ, రాంబాబు, సోదరి, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. వారి రోదన చూపరులను కంటతడి పెట్టించింది.

శేష జీవితం ఆనందంగా గడవాలి



జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌తో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు

నరసరావుపేట: పోలీసుశాఖ ద్వారా నిత్యం ప్రజాసేవ చేసి ఉద్యోగ విరమణ పొందిన వారందరూ శేష జీవితం కుటుంబ సభ్యుల మధ్య సుఖ సంతోషాలతో గడవాలని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆకాంక్షించారు. గత నెల 30న ఉద్యోగ విరమణ చేసిన ఏడుగురు పోలీసు అధికారుల వీడ్కోలు సమావేశం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ మలికా గార్గ్ పాల్గొని ప్రతి ఒక్కరిని పేరుపేరున అభినందిస్తూ సత్కరించారు. సన్మానం పొందిన వారిలో డీసీఆర్‌బీ ఎస్ఐ సీహెచ్.వీరాంజనేయులు, సత్తెనపల్లి పట్టణ పోలీసుస్టేషన్ ఏఎస్ఐ ఎం.రామ్మోహనరావు, ఐనవోలు పోలీసుస్టేషన్ ఏఎస్ఐ ఎం.చెంచయ్య, ఏఆర్ ఎస్ఐ వై.భాస్కరరావు, చిలకలూరిపేట పట్టణ పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.వెంకటేశ్వరరావు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు మొఘల్‌నాయబ్ రసూల్, పఠాన్ నుల్లాఖాన్ ఉన్నారు.

సీఎం చంద్రబాబుతో రైల్వే జీఎం అరుణకుమార్ జైన్ భేటీ

- రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులపై చర్చ
- గుంటూరు డివిజన్ అధికారులతో సమీక్ష



సీఎం చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

లక్ష్మీపురం: వెలగపూడిలోని సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సోమవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల గురించి చర్చించారు. ముఖ్యమంత్రితో పాటు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ, విజయవాడ డివిజన్ డీఆర్‌ఎం నరేంద్ర, ఎ.పాటిల్ ఉన్నారు. అక్కడ నుంచి గుంటూరు డివిజనల్ మేనేజర్ కార్యాలయానికి విచ్చేయడంతో అధికారులు, డీఆర్‌ఎం, ఏడీఆర్‌ఎం తదితరులు ఘన స్వాగతం పలికారు. డివిజన్ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ రైల్వే భద్రత ప్రాముఖ్యతను వివరించారు. ప్రధానంగా రైల్వే శాఖకు లోకో పైలట్లు , ఫ్రంట్ లైన్ సిబ్బంది పాత్ర చాలా ముఖ్యమైనదని వివరించారు. చాలా పెద్ద బాధ్యత వహిస్తారని చెప్పారు. నిబంధనల ప్రాముఖ్యతను కూడా జీఎం పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ డివిజన్ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేయాల్సిందిగా ఆదేశించారు. ఆదాయాన్ని మరింత పెంచడానికి ఆధునిక పద్ధతిలో ఆలోచన చేయాలని సూచించారు. దేశంలోని రికార్డు స్థాయిలో దక్షిణ మధ్య రైల్వే ఉండాలని ఆకాంక్షించారు. సమావేశంలో డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ, డివిజన్ ఏడీఆర్‌ఎం సైమన్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

మనవడు భీమ్‌రావ్ యశ్వంతరావ్



సభలో మాట్లాడుతున్న భీమ్‌రావ్ యశ్వంతరావ్

పాత బొమ్మువానిపాలెం(కొల్లిపర): అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ వాటిని ముందుకు తీసుకెళ్లాలని ఆయన మనవడు, గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ జాతీయ అధ్యక్షుడు భీమ్‌రావ్ యశ్వంతరావ్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. మండలంలోని పాత బొమ్మువానిపాలెంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ దళితులు, ఆదివాసీలకు మాత్రమే నాయకుడు కాదని, దేశంలోని ప్రతి పౌరుడికీ, హక్కులు కావాలనే ప్రతి ఒక్కరికీ నాయకుడేనని తెలిపారు. పాత బొమ్మువానిపాలెంలో విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విగ్రహ ఆవిష్కరణకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ నేటి యువత డీజేలు, ఇతర వాటికి బానిసలుగా మారారని విమర్శించారు. నిజమైన అంబేడ్కర్ అభిమానులు డీజేలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. తొలుత యువత, అంబేడ్కర్ అభిమానులు ముఖ్య అతిథుల్ని దావులూరు అడ్డరోడ్డు నుంచి విగ్రహావిష్కరణ సభా ప్రాంగణం వరకు జై భీమ్ నినాదాలతో, బైకు ర్యాలీతో తీసుకువచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అంబేడ్కర్ అభిమానులు, యువత పాల్గొన్నారు.

సమాజంలో ఉన్నతమైనది వైద్య వృత్తి

ఏపీ వైద్య విద్య అకడమిక్ డైరెక్టర్ రఘునందన్



మాట్లాడుతున్న రఘునందన్

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో ప్రతి ఒక్కరూ చేతులు జోడించేది ఇద్దరికేనని, ఒకరు భగవంతుడైతే మరొకరు వైద్యుడని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేషన్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ రఘునందన్ పేర్కొన్నారు. గుంటూరులో సోమవారం భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాక్టర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ సమాజంలో వైద్యవృత్తి ఉన్నతమైన పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజల ఆరోగ్యం తమ చేతుల్లోనే ఉందనే విషయాన్ని ప్రతి ఒక్క వైద్య విద్యార్థి గుర్తుంచుకోవాలని, తద్వారా రాబోవు తరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని తెలిపారు. ప్రముఖ సైకాలజిస్ట్ అండ్ మోటివేషనల్ స్పీకర్ సంద్ర సుధీర్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల శ్రమను గుర్తెరిగి కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాల్ని సాధించవచ్చని చెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థీ స్వీయ ప్రేరణతో తమను తాము మలచుకుని ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ అన్ని వృత్తుల్లో కెల్లా వైద్య వృత్తి ఉత్తమమైనదని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థి డాక్టర్ సాయి సౌమ్య భాష్యం మెడెక్స్‌తో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కన్నవారిని మరువరాదని, విద్య నేర్పిన గురువులను గౌరవించాలని సూచించారు. తొలుత బీసీ రాయ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాష్యం మెడెక్స్, మెడి ఎయిమ్స్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైవర్స్ కాలనీ యూపీహెచ్‌పీకి జాతీయ స్థాయి అవార్డు

- ఢిల్లీలో అవార్డు అందుకున్న స్టేట్ నోడల్ వైద్యులు
- హర్షం వ్యక్తం చేసిన వైద్యులు



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న వైద్యులు జె.విజయలక్ష్మి, రమాదేవి

తాడేపల్లి రూరల్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ప్రకాష్ నగర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నగర్(డ్రైవర్స్ కాలనీ) లోని యూపీహెచ్‌సీకి జాతీయ స్థాయి అవార్డు లభించింది. ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అవార్డును ఆంధ్రప్రదేశ్ నుంచి స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ జె.వి జయలక్ష్మి, స్టేట్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రమాదేవి, యూపీహెచ్‌సీ డాక్టర్ మానస ఈ అవార్డును అందుకున్నారు. అవార్డుతో యూపీహెచ్‌సీకి వచ్చిన బృందానికి సోమవారం సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఎన్‌హెచ్‌ఎం ఎండీ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ జె.వి జయలక్ష్మి, స్టేట్ క్వాలిటీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రమాదేవి, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా యూపీహెచ్‌సీలకు నేషనల్ క్వాలిటీ స్టాండర్స్ తీసుకురావడానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆసుపత్రిలోని 12 విభాగాల కృషి వల్ల ఇలాంటి అరుదైన అవార్డు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా యూపీహెచ్‌సీల పని విధానాన్ని పరిశీలించారన్నారు. ఇందులో మనం చేస్తున్న సేవలను గుర్తించి 97.2 మార్కులు కేటాయించారని తెలిపారు. జాతీయ హామీ ప్రమాణాల గుర్తింపు సర్టిఫికేషన్ ఇచ్చిందని, దానిలో భాగంగా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం అవార్డు అందించినట్లు వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి, డీపీఎంఓ డాక్టర్ రత్న మన్మోహన్, క్వాలిటీ కన్సల్టెంట్ వాసుదేవరాజు, స్టేట్ క్వాలిటీ కన్సల్టెంట్స్, సిబ్బంది కష్టపడి సమష్టిగా పనిచేయడం వల్ల ఈ అవార్డు దక్కిందని డాక్టర్ మానస చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పేద ప్రజలకు వైద్య సేవలు అదించేందుకు విశాలమైన భవనాలు నిర్మించి, అందులో రోగులకు వైద్య సేవలు అందించేందుకు ఓ.పి., అనుభవజ్ఞులైన డాక్టర్లు, 66 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని వివరించారు.

చదువు, అభివృద్ధి సంతోషంగా జరగాల్సిన ప్రక్రియ

- విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య
- బీటెక్ ఫస్టియర్ తరగతులు ప్రారంభం



తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న రత్తయ్య

చేబ్రోలు: విద్యార్థుల్లో చదువు, అభివృద్ధి అనేవి సంతోషంగా జరగాల్సిన ప్రక్రియని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో సోమవారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతుల ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడారు. విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రత్యేకంగా అమలు చేస్తున్న పంచ సూత్రాల (1.ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, 2.ప్లానింగ్, ట్రెనింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్, 3.కౌన్సెలింగ్ సిస్టమ్, 4.సీఆర్‌టీ తరగతులు, 5.బోధన పద్ధతి) వల్లే తమ దగ్గర చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాల్ని అధిరోహిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులంతా పిల్లల్ని బాగా ప్రోత్సహిస్తే ఆరోగ్యంగా, మానసికంగా, సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతారని సూచించారు. విద్యార్థులందరూ చదువులో మాత్రమే కాకుండా సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటేనే మంచి ప్రొఫైల్ డెవలప్ అవుతుందన్నారు. కమ్యూనికేషన్, టీమ్ స్పిరిట్ పెంచడానికి యూనివర్సిటీలో ఎప్పుడూ ఈవెంట్స్‌ను నిర్వహిస్తామని తెలియజేశారు. విద్యార్థుల్ని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ వారిలో దాగున్న నైపుణ్యాల్ని వెలికితీసి, అభ్యున్నతికి, పరిపూర్ణ వ్యక్తిత్వ నిర్మాణానికి తోడ్పడుతామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ రఘునాథన్ పాల్గొన్నారు.